తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
ఆదివారం
31 మే 2026
పేజీలు : 8
Follow :

# పెద్దపల్లి జిల్లా బాల్య వివాహాల రహిత జిల్లాగా ప్రకటన

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

### మహిళలపై అఘాయిత్యాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని ప్రతిజ్ఞ



**పెద్దపల్లి,మే 30(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనతో పాటు మహిళా సాధికారత, అక్షరాస్యత పెంపు కోసం చేపట్టిన కార్యక్రమాలు విశేష ఫలితాలను సాధించాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్నేహ కిశోర బాలికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మాక్ పార్లమెంట్‌లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ప్రజలతో చర్చించి, వారి అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకుని విధానాలను రూపొందించడమే ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనమని అన్నారు. ప్రజల అభిప్రాయాలు,సూచనలు లేకుండా బలవంతంగా తీసుకువచ్చే మార్పులు ఎక్కువ కాలం నిలవవని పేర్కొన్నారు. మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని అన్ని మహిళా సంఘాలలో చదువు రాని మహిళలను ఉల్లాస్ కార్యక్రమం కింద నమోదు చేసి, 5 వేల మంది వాలంటీర్ల సహకారంతో అక్షరాస్యత బోధించడం జరిగిందన్నారు. మార్చి నెలలో నిర్వహించిన పరీక్షలకు 34,620 మంది మహిళలు హాజరై 100 శాతం ఉత్తీర్ణత సాధించడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. రాబోయే జూలై నెలలో మిగిలిన 35 వేల మంది మహిళలకు కూడా పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, వాలంటీర్లు, మహిళా సంఘాల సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పెద్దపల్లి జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, 14 మండలాల పరిధిలోని 263 గ్రామ పంచాయతీలలో ఎక్కడా బాల్య వివాహాలు జరగడం లేదని ధృవీకరిస్తూ పెద్దపల్లి జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా ప్రకటించారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలు, వేధింపులు, వివక్షను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళల భద్రత, గౌరవ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత అధికారులు, స్నేహ కిశోర బాలికల సంఘం సభ్యులు,మహిళా సంఘాల ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.





# కొండగట్టు భక్తుల రద్దీ

**మల్యాల మే 30 (జనంసాక్షి)** తెలంగాణ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది స్వామివారి పర్వదినము వేసవి సెలవులు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు సుమారుగా 30 వేల మంది పైగా స్వామివారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. తెల్లవారుజామున భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లో గంటల తరబడి వేచి ఉన్నారు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకుని స్వామివారిని దర్శించుకుని క్షేత్రపాలకుడైన శ్రీ బేతలస్వామి వారిని కూడా దర్శించుకున్నారు. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు అంతా రద్దీ నెలకొంది. ఆలయ ఈఓ ఎస్. అంజనారెడ్డి భక్తులకు ఇలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు అశోక్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రహదారి వీరుల' పథకంపై కలెక్టర్ సమీక్ష

### ప్రమాద బాధితులను కాపాడితే రూ. 25,000 బహుమతి

**కామారెడ్డి ప్రతినిధి, మే 30 (జనంసాక్షి)** రహదారి ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడేందుకు ఉద్దేశించిన 'రహదారి వీరుల' (రహవిర్) పథకాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ పథకం అమలు తీరు పై ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా ప్రజలు తక్షణమే స్పందించి బాధితులకు సాయం చేయాలని, ప్రతి ఒక్కరూ 'రహదారి వీరులు'గా మారాలని పిలుపునిచ్చారు. ప్రమాదంలో ఉన్నవారిని సకాలంలో కాపాడిన వారికి ప్రభుత్వం తరఫున రూ. 25,000 నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటుఈ పథకాన్ని పారదర్శకంగా పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో 'డిస్ట్రిక్ట్ అప్రిసియేషన్ కమిటీ' ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా, సభ్యులుగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ , జిల్లా రవాణా అధికారిణ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తారని ఆయన వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, బాధితులకు తక్షణ వైద్యం అందేలా చూసేందుకు ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.



### వ్యవసాయ మార్కెట్ యార్డులో

# ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు




**కరీంనగర్ బ్యూరో, మే 30 (జనంసాక్షి) :** కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న ఆధ్వర్యంలో శనివారం రోజు మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు కేక్ కటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ల లతోకలిసి మాట్లాడుతూ... మంత్రి శ్రీధర్ బాబు ఆయురారోగ్యాలతో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నామని తెలిపారు. మార్కెట్ యార్డ్ సిబ్బంది, అధికారులు, హమాలీలు, కూలీలు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. వారందరికీ స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లు నరసన్న అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకర్, మాలోతూ కవిత, కాంగ్రెస్ నాయకులు సముద్రాల రమణారావు, డాక్టర్ రాజన్న, వేల్పుల వెంకటేష్, కనకరాజు, నారోజు రాకేష్, క్రాంతి, మిడిదొడ్డి కపిల్, మాధవ్, రాజేష్,పత్యం లక్ష్మీనారాయణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలి

- మట్టి మాఫియా తో కుమ్మక్కైన ఎమ్మెల్యే విజయరమణారావు
- రైతు పక్షపాతి అంటూ రైతుల నడ్డి విరవడం సమంజసమా
- గింజ కటింగ్ లేదంటూ 42 43 కాంట పెట్టడం రైతు ను మోసం చేయడమే
- ఎలిగేడు తహసిల్దార్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల ధర్నా
- తహసిల్దార్ కు వినతి పత్రం

**ఎలిగేడు,మే 30(జనంసాక్షి) :**
చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎలిగేడు మండలంలో తహసిల్దార్ కార్యాలయం ముందు బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి విచ్చేసిన బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బైరెడ్డి రాంరెడ్డి, తానిపర్తి మోహన్రావు మాట్లాడుతూ రైతు పక్షపతి నంటు ప్రగల్భాలు పలికే ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు రైతులను నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. గింజ కటింగ్ లేకుండా కొనుగోలు కేంద్రాలలో రైతులకు న్యాయం చేస్తానని చెప్పి, ఆచరణలో పెట్టడం లేదని, కొనుగోలు కేంద్రాలలో 40.600 గ్రాములకు బదులు, 42, 43 కాంట జోకుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో మట్టి మాఫియా ఇసుక మాఫియా అనేది లేకుండా చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే విజయ రమణారావు, కొ దురుపాక గ్రామంలోని చెరువు నుండి అక్రమంగా వందలాది పెద్ద టిప్పర్లతో తీస్తున్న మట్టి మాఫియాతో కుమ్మకై ,మట్టిని ఇష్టారాజ్యంగా వివిధ ప్రాంతాలకు తరలించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఒక్కో లారీ టిప్పర్ 12 టైర్ల నుండి 18 టైర్ల టిప్పర్లతో రాత్రి పగలు ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలకు మట్టిని అక్రమంగా తరలిస్తుంటే, ఎమ్మెల్యే విజయ రమణారావు ఏం చేస్తున్నాడని నిలదీశారు. మట్టి రవాణాలో రాయల్టీ కట్టింది గోరంత, మట్టి తరలించేది కొండంత అని వారు నిలదీశారు. గ్రామాలలో ఓవర్ లోడ్ తో వెళ్తున్న మట్టి టిప్పర్లతో రోడ్లన్నీ ద్వంసం అవుతున్నాయని, ఆట్టి రోడ్లను, పునర్నిర్మాణం చేసే బాధ్యత ఎమ్మెల్యే విజయ రమణారావు దేనని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలలో జరిగే అవినీతి అక్రమాలను నిలదీస్తే పోలీసుల చేత అక్రమ కేసులు పెట్టించడమే కాకుండా బెదిరింపులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పోలీసులు ఎమ్మెల్యే విజయరమణారావుతో సిండికేట్ అయ్యారని ఆరోపించారు. ప్రజల జీతాల తో విధులు నిర్వహిస్తున్న, పోలీసులు ప్రజల పక్షాన నిలబడి న్యాయం చేయాలి కానీ అలా చేయకుండా, అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో కుమ్ముక్కు కావడం ప్రజాస్వామ్యంలో ప్రజల, రైతుల, మనో ధైర్యాన్ని దెబ్బతీయటమేనని ప్రశ్నించారు. పోలీసు అధికారులు హుందాగా వ్యవహరించాలని, ప్రజల పక్షాన నిలబడాలని వారు కోరారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ వడ్లు కాంట అయితే చాలు అని దేవుణ్ణి మొక్కుతున్నారని, కటింగు అనేది పట్టించుకోవడం లేదని తెలిపారు. లారీలు రాక ధాన్యం దిగుమతి కాక రైతులు దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఆటకె క్కాయని, 6 గ్యారంటీలు ఎక్కడ అమలు కావడం లేదని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తోందని, ఇంకెప్పుడు ఆరు గ్యారంటీలు అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కళ్యాణ లక్ష్మి తులం బంగారం తో పాటు మహిళలకు 2,500లు ఇంతవరకు ఇచ్చిన దిక్కే లేదన్నారు. విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వలేదని, నూతన పింఛన్లు వితంతు పింఛన్లు వికలాంగుల పెన్షన్లు పెంచుతామని ఎందుకు పెంచలేదని నిలదీశారు. ఉచిత బస్సు ప్రయాణంతో బజారున పడ్డ ఆటో డ్రైవర్ల పరిస్థితి రాష్ట్రంలో దీనంగా ఉందని, కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలన విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజులలో తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. తహసిల్దార్ యాకయ్యకు వినతి,పత్రం అందజేశారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం జరగకపోతే రానున్న రోజులలో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నాయకత్వంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని బైరెడ్డి రామిరెడ్డి, తానిపర్తి మోహన్రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బైరెడ్డి రామ్ రెడ్డి,తానిపర్తి మోహన్రావు, కవ్వంపల్లి బాపయ్య, రాచపల్లి కొండయ్య,తంగేళ్ల కుమార్ యాదవ్,పోచయ్య,భూమయ్య,సంతోష్,దామసధి, రవీందర్,ప్రభాకర్ రెడ్డి,రాకేష్ రావు,మహేందర్తో పాటు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





## టీబీ రహిత సమాజాన్ని నిర్మాణం చేద్దాం

**సుల్తానాబాద్,మే 30(జనంసాక్షి) :**
టీబీ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరం భాగస్వామ్యం కావాలని దుబ్బపల్లి గ్రామ సర్పంచ్ ఉమ్మెంతల శోభ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం నిక్షయ్ శివిర్ - టీబీ స్క్రీనింగ్స్ దుబ్బపల్లి గ్రామంలో గర్రెపల్లి పీహెచ్సీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం,ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ ఉమ్మెంతుల శోభరవీందర్ రెడ్డిసహకారం తో అధునాతన ఎక్రే పరికరం తో ఛాతి పరీక్షలు నిర్వహించారు. ఇందులో సుమారు 100 మంది గ్రామ ప్రజలకు పరీక్షలు చేయగా, పలువురికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉమ్మెంతుల శోభరవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ తిప్పారపు రాజయ్య,పాలకవర్గం వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి,సబ్ సెంటర్ వైద్యాధికారి వైద్యులు సంతోష్,ఏఎన్ఎంలు,షబానా,స్వరూప,భూలక్ష్మి, ఆశలూ ప్రమీల, కవిత,జమున,స్వరూప,సరోజన,హెచ్ ఏ రాజేశ్వర్ రావు,అనిత,ఎక్రే టెక్నీషియన్ రాజు,తదితరులు పాల్గొనారు.

## ప్రతిభకు పట్టాభిషేకం



**సుల్తానాబాద్,మే 30(జనంసాక్షి) :**
మండలంలోని భూపతిపూర్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఐ సి ఐ,కరీంనగర్ ప్రేరణ రీజియన్-9 ఆధ్వర్యంలో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న,ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల సమక్షంలో 42 మంది విద్యార్థినులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలు, మానసిక ధైర్యం, వ్యక్తిత్వ వికాసం గురించి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఐసిఐ,రీజియన్-9 ప్రెసిడెంట్ ఇజ్జగిరి శ్రీనివాస్,చందా న్యూరో ట్రామా కేర్ సెంటర్,డాక్టర్ చందా శ్రీనివాస్ రావు,మేరుగు నరేష్,రేపాక లింగమూర్తి, ప్రిన్సిపాల్ శ్రీమతి మోతె స్వప్న ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు విద్యార్థినులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడటమే తమ లక్ష్యమని తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ సభ్యులు తెలిపారు.



## నేరాల నియంత్రణకే కార్డెన్ సర్చ్

- అనుమతి లేని 20 వాహనాలు అదుపులోకి
- సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు

**సుల్తానాబాద్,మే 30(జనంసాక్షి) :** నేరాలను నియంత్రించేందుకే కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరుగుతుందని సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు, స్పష్టం చేశారు. శనివారం ఉదయం మండల కేంద్రంలోని మార్కండేయ కాలనిలో ఎస్ఐ లు చంద్రకుమార్, అదనపు ఎస్సైలు అశోక్ రెడ్డి పోలీస్ సిబ్బంది తో కలిసి కాలనీలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమతులు లేని 20 వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐ రంజిత్ రావు మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులు ఎవరైనా కాలనీలో సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వివిధ వ్యాపారాలు నిర్వహించే వ్యాపారులు ఎవరైనా అనుమానితులు చోరీకి పాల్పడిన వస్తువులను కొనుగోలు చేయవద్దని, అలాంటి వస్తువులు ఎవరైనా కొనుగోలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నిందితులతో పాటు కొనుగోలు చేసిన వారు సైతం శిక్ష అర్హులు అవుతారని అన్నారు. విధిగా ప్రతి వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సత్ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు. యువత చోరీలకు మత్తు పదార్థాలకు బానిసలై తమ విలువైన జీవితాలను వృధా చేసుకోవద్దని ఒక్కసారి కేసు నమోదు అయితే జీవితంలో ఏ ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత లభించదని జీవితాన్ని అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు లతోపాటు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఘనంగా దుద్దిల్ల జన్మదిన వేడుకలు

సుల్తానాబాద్,మే 30(జనంసాక్షి) :
రాజకీయ దురన్ధరుడు, ప్రజల మనిషి, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదినోత్సవాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిరుదు రాధాకృష్ణ మాట్లాడుతూ నిస్వార్థ ప్రజాసేవ చేయడంలో మంత్రి శ్రీధర్ బాబు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. తన తండ్రి స్వర్గీయ శ్రీపాదరావు రాజకీయ వారసత్వాన్ని పునికి పుచ్చుకొని, నిత్యం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఐటీలో అగ్రగామిగా నిలుపుతున్నారని కొనియాడారు. రానున్న రోజులలో శ్రీధర్ బాబు రాజకీయరంగంలో ఉన్నత పదవులు పొందాలని కోరారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వరప్రదీప్ తొర్రికొండ ప్రభాకర్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్,మాజీ సింగిల్ విండో చైర్మన్ కల్లేపల్లి జానీ,ఈర్ల శేఖర్,పెగడ పరుశు రాములు,నాయకులు కుమార్,కిషోర్,రాకేష్,గాదాసు రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.



## పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా ఐటీ మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**పెద్దపల్లి,మే 30(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కమ్మగోని చౌదరి గౌడ్ అధ్వర్యంలో ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం బస్టాండ్ లోని ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది..ఈ సందర్భంగా చౌదరి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ ఐటీ రంగాన్ని దేశంలోనే నెంబర్ వన్ చేస్తూ రోజుకి 20 గంటలకు ప్రజలకు సేవలందిస్తూ ప్రజా నేత గా పేరుపొందిన నేత గా ఎదిగిన మన శ్రీధర్ బాబు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి ప్రసాద్,యువజన కాంగ్రెస్ నాయకులు కోల అనిల్ యాదవ్,యువజన కాంగ్రెస్ పెద్దపల్లి మండల ఉపాధ్యక్షులు అరగొండ రాజ్ కుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు చంద శంకర్,బొడ్డుపల్లి అశోక్,కీర్తి రాజయ్య,మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిటవేన వినోద్ యాదవ్,యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు గడ్డం సాయి,కీర్తి హరీష్, మద్దుల ప్రశాంత్,కనుకుంట్ల సదానందం,కరుపాకల రవి,వెంకటేష్,గుర్రాల రాజు,సిరిసిల్ల శంకర్, చిటవేన మోహన్,కాంగ్రెస్ నాయకులు బండి మల్లేష్,పోగుల తిరుపతి యాదవ్,రవితేజ,కొయ్యడ నాగరాజు,చింతల కుమార్, సారంగం,శివ గౌడ్,రమేష్,లోకేష్,రాజ్ కుమార్, అజయ్,రంజిత్,ప్రశాంత్,శ్రవణ్ లు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**- జూన్ 10న లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల ఎంపిక**

**- 1వ, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి**

**పెద్దపల్లి,మే 30(జనంసాక్షి) :**



2026-27 విద్యా సంవత్సరానికి గాను పెద్దపల్లి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) పాఠశాలల్లో 1వ తరగతి, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాకు చెందిన అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్) లో 70 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్) లో 73 సీట్లు కేటాయించడం జరిగిందని ఆయన వివరించారు.కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000/- లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000/- లోపు ఉండాలని,1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ ప్రవేశం కోరే విద్యార్థులు 01.06.2020 నుండి 31.05.2021 మధ్య జన్మించి ఉండాలి, ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని తెలిపారు.ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారాలను మే 16 నుండి జూన్ 05 వరకు జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్ లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుండి పొందవచ్చును. పూర్తి చేసిన దరఖాస్తులను తగిన ధ్రువీకరణ పత్రాలతో (కులం, ఆదాయం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు మొదలైనవి) జతపరిచి జూన్ 06వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు అదే కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.వచ్చిన దరఖాస్తుల నుండి జూన్ 10న లాటరీ పద్ధతి ద్వారా సీట్ల కేటాయింపు నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, ఇతర వివరాల కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లేదా ఫోన్ నెంబర్లు 9014327045, 9989354155 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అంగన్వాడి చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేసిన సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ యాదవ్

**పెద్దపల్లి,మే 30(జనంసాక్షి) :**



కమాన్ పూర్ మండలం పెంచికల్‌పేట్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు గ్రామ సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ ఆధ్వర్యంలో యూనిఫామ్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల విద్యాభివృద్ధి మరియు వారి సంక్షేమం కోసం గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.అంగన్వాడి దశ నుంచే పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో యూనిఫామ్‌లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. యూనిఫామ్‌లు అందుకున్న చిన్నారులు ఆనందం వ్యక్తం చేయగా,వారి తల్లిదండ్రులు సర్పంచ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ప్రతి చిన్నారి విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉంటామని సర్పంచ్ పల్లె మాధవి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఈశ్వరి, కౌసల్య మరియు అంగన్వాడీ సిబ్బంది,గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఐ ఎన్ టి యు సి ని బలోపేతం చేయాలి

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు

**సుల్తానాబాద్,మే 30 (జనంసాక్షి) :**



ఐఎన్‌టియుసి ని ఈ ప్రాంతంలో బలోపేతం చేసి కార్మిక సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయ రమణారావు సూచించారు. శనివారం పూసాల గ్రామానికి చెందిన, సీనియర్ కాంగ్రెస్ నేత నీరటి శంకర్, ఐ ఎన్‌టి యు సి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నూతనంగా నియామకం కావడంతో, విజయ రమణారావు మర్యాదపూర్వకంగా కలిశారు.



## ఎస్సై వేణుగోపాల్ సేవలు ఆదర్శం

### కమిషనర్ అంబర్ కిషోర్ జూ

**సుల్తానాబాద్,మే 30(జనంసాక్షి) :**
విధి నిర్వహణలో ఎస్ఐ వేణుగోపాల్ సేవలు ఆదర్శమని రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ జూ అన్నారు. శనివారం ఎస్సై వేణుగోపాల్ పదవి విరమణ సందర్భాన్ని పురస్కరించుకొని, రామగుండం కమిషనరేట్ లో ఎస్సై వేణుగోపాల్ ను కమిషనర్ అంబర్ కిషోర్ జూ, పూలమాల శాలువాతో ఘన సత్కారం చేశారు.ఈ, సందర్భంగా కమిషనర్ అంబర్ కిషోర్ జూ మాట్లాడుతూ, ఎస్ఐగా వేణుగోపాల్ శాంతి భద్రతల పరిరక్షణలో, నిబద్ధత తో నిధులు నిర్వహించారని కొనియాడారు. శేష జీవితం కుటుంబంతో, సంతోషాలతో గడపాలని కోరారు. పోలీస్ శాఖ వేణుగోపాలకు అండగా ఉంటుందని,వేణుగోపాల్ పోలీస్ శాఖ లో పనిచేసిన సమయంలో క్రమశిక్షణ కలిగిన ఉద్యోగిగా గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు.

# మంత్రి శ్రీధర్ బాబు నిష్పక్షపాత ప్రజాసేవకుడు!

- ○ ఐటీ రంగం అభివృద్ధిలో దిట్ట
- ○ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు
- ○ అంతటి అన్నయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**సుల్తానాబాద్,మే 30(జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నిష్పక్షపాత ప్రజాసేవకుడని, శ్రీధర్ బాబు సేవలు సేవలు వెల కట్టలేనివని, నిత్యం ప్రజా సంక్షేమ పథకాల అమలులో, తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలకు ముఖ్య ఆహ్వానితులుగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు బాణా సాంచ పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా, విజయ రమణారావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం లోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ కు అనేక పారిశ్రామిక రంగాలను తీసుకువచ్చారని, రానున్న రోజుల్లో ఈ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి మరిన్ని సంస్థలను తీసుకురావాలని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ముందు ముందు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రంథాల సంస్థ అధ్యక్షులు అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ, ఈ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు తనయుడిగా ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. నిత్యం ప్రజల కోసమే ప్రజాక్షేత్రంలో నిలబడి ప్రజల కోసం పనిచేస్తున్నారని, అలాంటి గొప్ప నాయకుడి జన్మదిన వేడుకలు జరపడం ఆనందంగా ఉందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు మాట్లాడుతూ, మంత్రి శ్రీధర్ బాబు రానున్న రోజుల్లో ఈ ప్రాంత అభివృద్ధికి మరింత చేయుత నందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత పార్టీ శ్రేణులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దన్నాయక్ దామోదర్ రావు, సాయిరి మహేందర్, పన్నాల రామన్న, అమీరి శెట్టి రాజలింగం, కల్లేపల్లి జానీ, దన్నాయక్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలుక సతీష్, దుగ్యాల సంతోష్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, చింతల రాజు, సిద్ధ తిరుపతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మోబి న్, ఆరేపల్లి కిరణ్, రఫిక్, నన్ను, దున్నపోతుల రాజయ్య, దున్నపోతుల మధు, సర్పంచులు మేకల పోచం, కోదాటి సాయికిరణ్, నాయకులు ఎరుకొండ రమేష్, ఎరుకొండ తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పిఏసిఎస్ డైరెక్టర్లు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు,







# ఘనంగా పోచమ్మతల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

**సైదాపూర్ మే 30( జనం సాక్షి)**
సైదాపూర్:మండలంలోని పెర్కపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పోతరాజు భవిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం నుండి అర్చక బృందం సుబ్రహ్మణ్య శర్మ,శంకర శర్మ, శ్రీనివాస్ శర్మల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి వారికి,పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను భక్తుల సమక్షంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. గణపతి పూజ, పుణ్య వాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన,నవగ్రహ, దంపతులచే హోమం కార్యక్రమాలను నిర్వహించారు.సాయంత్రం గ్రామ మహిళలచే కుంకుమార్చన, మంగళహారతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులకు,గ్రామస్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 31న ఆదివారం సాయంత్రం పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ భవిత శ్రీనివాస్ చెప్పారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతరాజు భవిత శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొల్ల పరమేశ్వర్,వార్డు సభ్యుడు కాశవేణి రవీందర్, గ్రామస్తులు ముత్యాల మల్లేష్ యాదవ్,పోతరాజు శ్రీనివాస్, బోల్ల శంకరయ్య,పోతరాజు శ్రీనివాస్,తిప్పని కుమార్, పోతరాజు శ్రీనివాస్, లక్కర్స్ బుచ్చయ్య, పోతరాజు అనిల్, జక్కోజు సుదర్శన్,పోతరాజు మల్లయ్య, పోతరాజు సాయి బాబా, బోల్ల శ్రీధర్, పోతరాజు అనిల్,లక్కర్స్ హరీష్, తిరుమలేష్, పోతరాజు వెంకటేశ్వర్లు, తిప్పని దేవయ్య, పోతరాజు కర్ణాకర్,పోతరాజు కనకయ్య,తిప్పని సురేష్,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## రాజాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం

**శంకరపట్నం మే 30 జనం సాక్షి:**
శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ కొంకటి రవి ఆధ్వర్యంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, సమాజంలో కులవివక్ష, అంటరానితనం, అస్పృశ్యత వంటి సామాజిక దురాచారాలను పూర్తిగా నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కులం పేరుతో ఎవరినైనా అవమానించడం, దూషించడం లేదా వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం రాజ్యాంగం కల్పించిన ప్రధాన విలువలని, వాటిని ప్రతి గ్రామంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. గ్రామాల్లో ఐక్యత, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో ప్రభాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాములు, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఓదెలు, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకే అమ్మ మాట-అంగన్వాడి బాట..

### సమావేశంలో సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ వెల్లడి

**చిగురుమామిడి మే30(జనంసాక్షి):**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట-అంగన్వాడీ బడి బాట కార్యక్రమం సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ భవాని మాట్లాడుతూ అంగన్వాడి స్కూల్లో మూడేళ్లు నిండిన చిన్నారుల నమోదును పెంచడానికి చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట అని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా మూడేళ్లు నిండిన అర్హులైన పిల్లలను అంగన్వాడీలలో చేర్పించడానికి తల్లులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.తల్లులతో పిల్లలను అంగన్వాడీ కీ పంపించాలని,అంగన్వాడీ కేంద్రంలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.అంగన్వాడీ పిల్లలకు యూనిఫామ్ లను పంపిణీ చేశారు.ప్రిస్కూల్ పిల్లలకు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయలక్ష్మి రాజు యాదవ్,ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇశ్రత్ సుల్తానా,వార్డ్ సభ్యులు రాకం అంజవ్వ,అంగన్వాడీ టీచర్లు పన్యాల అనురాధ, గొల్లపల్లి ధనలక్ష్మి,ఉల్లెంగుల ఇందిర,బెజ్జంకి సంపూర్ణ,పిల్లలు, పిల్లల తల్లులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## నెంబర్ టు తస్మాత్ జాగ్రత్త

### -సెకండ్ హ్యాండ్ మొబైల్స్, బైకుల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ శేఖర్ రెడ్డి

**శంకరపట్నం మే 30 జనంసాక్షి:**
సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేశవపట్నం ఎస్ఐ కే. శేఖర్ రెడ్డి శంకరపట్నం మండల ప్రజలకు సూచించారు.ఇటీవల కొందరు దొంగలు మొబైల్ ఫోన్లు, బైకులను దొంగిలించి తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లు తెలిపారు.అత్యవసరంగా డబ్బులు కావాలని చెప్పి తక్కువ ధరకే మొబైల్ లేదా బైక్‌ను అమ్మడం, తాకట్టు పెట్టడం వంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం అసలు యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సాంకేతిక ఆధారాల ద్వారా వాటిని స్వాధీనం చేసుకుంటున్నట్లు వెల్లడించారు.సరైన పత్రాలు లేకుండా కొనుగోలు చేసిన వారు చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సెకండ్ హ్యాండ్ వస్తువులు కొనుగోలు చేసే ముందు అసలు బిల్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, యజమాని గుర్తింపు కార్డులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా తక్కువ ధరలకు వస్తువులు విక్రయించేందుకు ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



## జువ్వాడి భవన్ లో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు...



**మెట్‌పల్లి, మే 30, జనం సాక్షి :**
రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మెట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రైసుద్దీన్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కలిసి కేక్ కట్ చేసి మంత్రి శ్రీధర్ బాబు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ముఖ్యంగా జిల్లాలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయడం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం ఆయన చేస్తున్న సేవలను ప్రజలు ఎప్పటికీ మరువరని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుడికందుల అజయ్, మాసుల ప్రవీణ్, రెబ్బాస్ మహేష్, పందిరి రమేష్, వంశీ, సూరి, నజీమ్, పాసి, కాసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,మే 30(జనంసాక్షి) :
జనాభా గణన-2027లో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించి ఎన్యూమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హౌస్ లిస్టింగ్ సర్వేలో పాల్గొని ఎన్యూమరేటర్‌కు అవసరమైన వివరాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్వే ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ సర్వే జనాభా గణన-2027లో అత్యంత కీలకమైన దశ అని తెలిపారు. ప్రతి ఇంటి నిర్మాణం, గృహ సౌకర్యాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య సదుపాయాలు,విద్యుత్, వంట ఇంధనం, కమ్యూనికేషన్ సౌకర్యాలు తదితర వివరాలను ఈ సర్వే ద్వారా నమోదు చేస్తారని చెప్పారు.సర్వే ద్వారా సేకరించే సమాచారం ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యులు పూర్తి స్థాయిలో సహకరించి సరైన వివరాలను అందించాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఈ సమాచారంతో ఏ సంక్షేమ పథకం రద్దు కావడం గానీ, లబ్ధిదారుల అర్హతలు ప్రభావితమవడం గానీ జరగదని స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి అపోహలకు తావివ్వకుండా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు, పర్యవేక్షకులు నిబంధనల ప్రకారం ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను నమోదు చేయాలని, సర్వేను పారదర్శకంగా,నాణ్యతతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

**పెద్దపల్లి,మే 30(జనంసాక్షి) :**
పెద్దపల్లి బస్టాండ్ వద్ద మండల హాస్పిటల్ మెయిన్ డ్రైనేజ్ ప్లాస్టిక్ వ్యర్థలతో నిండిపోవడంతో శనివారం మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగించడం జరిగింది.అట్టి పనులను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పరిశీలించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ ప్రజలు దయచేసి మీ ఇండ్లలో వెళ్లే చెత్తను తడి పొడి చెత్తగా వేరుచేసి మీ వద్దకు వచ్చే మా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని ప్లాస్టిక్ బాటిల్స్ వేరు చేసి ప్రతి శుక్రవారం రోజున మా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని దయచేసి మీ ఇంటి ముందున్న మురికికాలువలో ప్లాస్టిక్ వ్యర్థలను వెయ్యరాదని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మా మున్సిపల్ సిబ్బందికి సహకరించి పెద్దపల్లి పట్టణాన్ని స్వచ్ఛ పెద్దపల్లిగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ రెడ్డి,మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత - ఒక గొప్ప మార్పు

## మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి ప్రతినిధి, మే 30 (జనంసాక్షి)**

ఒకప్పుడు మహిళలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు వెనుకాడే పరిస్థితి ఉండేది. కానీ నేడు పురుషులు తమ భార్యల పేర్లు చెప్పి, వారు ఏ సంఘంలో ఉన్నారో తెలియజేస్తూ లోన్ల కోసం అడిగే స్థాయికి మార్పు వచ్చిందని ఇది మహిళా సాధికారతకు ఒక నిదర్శనమని మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. 535.30 కోట్ల పంపిణీ: బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు ఇంత భారీ మొత్తంలో రుణాలు అందించడం చాలా గర్వకారణమని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత అందిస్తుందని మంత్రి సీతక్క ప్రతి చిన్న సంఘానికి 10 లక్షల రూపాయల వడ్డీ లేని రుణం అందించడం విశేషమన్నారు. రుణాల సద్వినియోగం ఆర్థిక ప్రణాళికతీసుకున్న రుణాన్ని అప్పుల పాలు కాకుండా, కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎలా వాడాలో చైర్మన్ స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చారు. 50% వ్యాపార అవసరాలకు లోన్ మొత్తంలో సగం డబ్బును ఖచ్చితంగా ఏదైనా వ్యాపారం లేదా ఉపాధి మార్గాల కోసం పెట్టుబడిగా పెట్టాలని మిగతా 50% కుటుంబ అవసరాలకు మిగిలిన సగాన్ని పిల్లల చదువులు, వైద్యం నిత్య వసరాల వంటి ముఖ్యమైన వాటికి ఉపయోగించా లన్నారు. వాయిదాల చెల్లింపు లక్ష రూపాయల రుణానికి నెలకు దాదాపు ?4,000 వాయిదా చెల్లించాల్సి ఉంటుందని ఈ వాయిదా కట్టడానికి మళ్లీ కొత్త అప్పులు చేయకూడదని వ్యాపారం ద్వారా వచ్చే లాభాల నుంచే క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించాలని పేర్కొన్నారు. పిల్లల చదువు తల్లే మొదటి గురువు పిల్లలను ఉన్నత చదువులు చదివించి, రాబోయే తరానికి ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దే బాధ్యత తల్లులపైనే ఉందని ఒక కుటుంబం బాగుండాలి అంటే అది మొదట తల్లితోనే ప్రారంభం అవుతుంది అని మహిళలు నిరూపించాలన్నారు. మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అధికారులు కేవలం రుణాలు ఇవ్వడంతోనే తమ బాధ్యత ముగిసిందని అనుకోకూడదు. మహిళలు చేసుకున్న - మైక్రో క్రెడిట్ ప్లాన్ అనగా (సూక్ష్మ రుణ ప్రణాళికఆధారంగానే )రుణాలు గ్రౌండ్ అయ్యేలా చూడాలి. లోన్ తీసుకున్న వారు దానిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో నిరంతరం గమనిస్తూ, వారు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా సిబ్బంది మార్గదర్శకత్వం వహించాలని"డబ్బు ఎంత తీసు కొన్నామన్నది కాదు, దాన్ని ఎంత క్రమశిక్షణతో వాడామన్నదే ముఖ్యమన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి కుటుంబం ఆర్థిక అక్షరాస్యత సాధించి ఒక మహావృక్షంలా మారినప్పుడే దేశంలో పేదరికం అంతమై అభివృద్ధి సాధ్యమవుతుంది." ప్రభుత్వ పథకాలు ప్రతి 18 సంవత్సరాలు నిండిన మహిళకు ఉచిత శిర ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని అదేవిధంగా సమాఖ్యల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి వారికి నెలకు 69 వేల పైబడి ఏడు సంవత్సరాల వరకు ప్రతినెల వడ్డీ చెల్లించడం జరుగుతుంద న్నారు. ఆ విధంగా సమాఖ్యలను మెరుగు పరుస్తుంది కాంగ్రెస్ గవర్నమెంట్, పెట్రోల్ బంకులు సమాఖ్య లకు ఇచ్చి ఆదాయాన్ని తెచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ముఖ్యంగా సామాజిక కార్యక్రమాల్లో ముందు మన తల్లి పై మనం ఎంత ప్రేమ చూపిస్తామని





తెలిపారు. ఆలోచించి మీ అత్తమామలను కూడా అదే విధంగా చూస్తూ వారి వృద్ధాప్య జీవితానికి చేదోడు వాదోడుగా ఉండాలి అనాథ శరణాలకు షణార్ధి చెప్పి మన ఇంట్లోనే మనతోనే ఉంచుకొని వారితో కాసేపు మాట్లాడినట్లయితే వాళ్ళ ఆయుష్షును పెంచిన వాళ్ళము వారి ఆనందాలకు అవకాశం ఇచ్చిన వారిమవుతాము ఇలాంటి కార్యక్రమాలు మహిళలతో స్టార్ట్ అవుతే మహిళల పేరు మరి ఎక్కువగా మారుమోగుతాయని కావున ఇలాంటి వాటిని కూడా మనం అదుపులోకి తీసుకోవాలని తమరికి తెలియ పరుస్తున్నాను

ప్రభుత్వం ఇచ్చే ప్రతిఫలాన్ని అందుకొని మీ కుటుంబాలు ఆనందముగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ గిరి, స్థానిక కౌన్సిలర్ గ్యార అఖిల,మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, రవి శేంకర్, అనసూయ, రిసోర్స్ పర్సన్స్, పట్టణ సమాఖ్య కార్యవర్గ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



# రైతు బీమా అందకపోవడం దురదృష్టకరం

సదాశివనగర్ (జనంసాక్షి)

రైతు కుటుంబాలకు అండగా నిలవాల్సిన 'రైతు బీమా' పథకం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లో నిర్లక్ష్యం వల్ల అభాసుపాలవుతోందని సదాశివనగర్ మండల టి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు సాయగౌడ్ తీవ్రంగా మండిపడ్డారు. మండలంలో చనిపోయిన ఓ రైతు కుటుంబానికి ఇప్పటికీ రైతు బీమా సొమ్ము అందకపోవడంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత రైతు కుటుంబం లాభిషెట్టి లింగం మర్కల్ గ్రామం తరపున తాను వ్యవసాయ అధికారి (ఏ వో )ని సంప్రదించగా, సదరు రైతు బీమా ఫైల్ ఇంకా "ఎల్ఐసీ (ఎల్ ఐ సి ) లో ప్రాసెసింగ్ " చూపిస్తోందని సమాధానం ఇచ్చారన్నారు. పాలసీల ప్రీమియంలు సకాలంలో చెల్లించకపోవడం వల్లే ఎల్ఐసీ వద్ద ఫైళ్లు పెండింగ్‌లో పడుతున్నాయని సాయగౌడ్ ఆరోపించారు. ఇప్పటి వరకు ఎల్ ఐ సి వద్ద మొత్తం 11 పెండింగ్ లో ఉన్నాయన్నారు. చనిపోయిన రైతు కుటుంబాలను కూడా కార్యాలయాల చుట్టూ తిప్పడం దారుణమన్నారు. ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఎల్ఐసీ అధికారులతో మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న రైతు బీమా క్లెయిమ్‌లను వెంటనే క్లియర్ చేసి బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతు కుటుంబాలకు న్యాయం జరిగే వరకు టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాడుతామని సాయగౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు చాకలి లింగం, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణారెడ్డి, జంగం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన

**పెద్ద కొడప్గల్ మే 30 (జనంసాక్షి):**

పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలో శనివారం ప్రజలకు ఎస్సై అరుణ్ కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం తెలుపవద్దని, ఓటీపీలు చెప్పవద్దని, సోషల్ మీడియాలో వచ్చే మోసపూరితపు లింకులను ఓపెన్ చేయవద్దని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో సంచరిస్తున్నట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండల ప్రజలు ఉన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

**ఆర్మూర్,మే 30(జనంసాక్షి):**



ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు మందుల బాలు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు 37 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించడం జరిగిందన్నారు. సీఎం సహాయనిది చెక్కుల విలువ రూ. 23.55 లక్షల పై చిలుకు మొత్తాన్ని లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. పేదలకు అవసర నిమిత్తం సీఎం సహాయనిది అండగా నిలుస్తుందన్నారు. చెక్కులను అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొట్టు రాజు, శ్రావణ్ గౌడ్,బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ఉదయ్ గౌడ్, బీజేవైఎం కార్యదర్శి పెద్దోళ్ల భరత్, బిజెపి నాయకులు అరుణ్,షికారి శ్రీనివాస్,వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల పై సమీక్ష

### కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి ప్రతినిధి, మే 30 (జనంసాక్షి)**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ తో కలిసి కార్యక్రమాల నిర్వహణ, కార్యాచరణ ప్రణాళిక, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపు చర్యలపై చర్చించారు. జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా మొక్కల నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు, విద్యా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రకృతి సంరక్షణపై చర్చా వేదికలు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్థాయిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

# ఇల్లంతకుంటలో ఎస్పీ శ్రీ మహేష్ బాబాసాహెబ్ గితే ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు

**ఇల్లంతకుంట మే 30(జనంసాక్షి )**



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బృందంతో వివిధ షాపులు, కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల్లో గంజాయి, మత్తు పదార్థాలు, నిషేధిత మాదక ద్రవ్యాల విక్రయాలపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులకు మత్తు పదార్థాల విక్రయం చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీలలో ఎస్సై అశోక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసిల్దార్ మహేందర్ కుమార్

**పిట్లం మే 30(జనం సాక్షి)**



పిట్లం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసిల్దార్ మహేందర్ కుమార్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తూకం మరియు లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రం లో రైతులు పడుతున్న ఇబ్బందులు తదితర విషయాలను, రైతులకు జొన్నల కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిల ను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి జొన్నలు 10 క్వింటాళ్లు నుండి 20 క్వింటాలకి పెంచాలని తహసిల్దార్ మహేందర్ కుమార్ కు రైతులు విజ్ఞప్తి చేశారు.



## పొగాకుకు దూరంగా ఉండండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి

### పొగాకులో ప్రమాదకర రసాయనాలు క్యాన్సర్ వచ్చే సూచన ఎక్కువ డాక్టర్ యేమిమా

**భిక్కనూరు మే 30 (జనం సాక్షి మండల ప్రతినిధి)**

భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం శనివారం నిర్వహించారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ యేమిమా ప్రజలకు అవగాహన కల్పిస్తూ,సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు, ఈసందర్భంగా డాక్టర్ యేమిమా మాట్లాడుతూ సిగరెటు,బీడీ,తంబాకు,గుట్కా వీటిని వాడటం వల్లవచ్చే వ్యాధులు నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరించారు,పొగాకు వల్ల కనిపించే లక్షణాలు నోటిలో తెల్లటి లేదా ఎర్రటి మచ్చలు,మానని పుండ్లు, నమలడంలో ఇబ్బంది,నోటిలో నొప్పి,ఉంటుంది తెలిపారు, పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని,పాఠశాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో పొగాకు అమ్మకాలు నిషేధించాలని సూచించారు,జీవితంలో ఎవరు కూడా వీటిని వాడవద్దని వీటికి దూరంగా ఉండాలని తమకు తెలిసిన వారందరికి కూడా చెప్పాలని తెలియజేశారు, ఈక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వనశ్రీ,ఎం.ఎల్.హెచ్.పి.పూజ పి.హెచ్.ఎన్ జానకి,నర్సింగ్ ఆఫీసర్ హరిత,శ్రావణ్ కుమార్, ఆరోగ్యవిస్తీర్ణ అధికారి వెంకటరమణ,సిబ్బంది సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో 5 పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు

### ఎంఈఓ జయ నరసింహారావు

**మల్యాల మే 30 (జనంసాక్షి)**




ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పెంచాలని ఉద్దేశంతో ప్రారంభించిన ప్రీ ప్రైమరీ తరగతులను మండలంలోని ఓబులాపూర్, రాంపూర్,నూకపల్లి ముత్యంపేట మరియు మానాల ప్రాథమిక పాఠశాలలో 2026- 2027 సంవత్సరానికి ప్రారంభిస్తున్నామని,ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించడానికి ఒక్కొక్క పాఠశాలకు 1 లక్ష 70,వేల రూ నిధులలు కేటాయించారని ఎంఈఓ జయ నరసింహారావు తెలిపారు.ప్రత్యేక గదులు కేటాయించి గదులలో ఆకర్షణీయమైన రంగురంగుల బొమ్మలు, ఫర్నిచర్ ఆట వస్తువులు,స్టేషనరీ ఏర్పాటు కేటాయిస్తామని తెలిపారు.



## ఎడపల్లిలో సిఐటియు 56వ జెండా ఆవిష్కరణ

**ఎడపల్లి, మే 30 ( జనంసాక్షి ) :**

ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం సిఐటియు 56వ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జంగం గంగాధర్ మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కూడా ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వేతనాల అమలు కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని ఈ మేరకు జూన్ 8వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి ఉంటుందని జంగం గంగాధర్ హెచ్చరించారు. ఎడపల్లి మండల అధ్యక్షురాలు జే పద్మ మాట్లాడుతూ, ప్రభుత్వము ప్రకటించిన రెండేళ్ల వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు నూనె, డ్రెస్సులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంట సంతోష్ జిల్లా ఉపాధ్యక్షులు, మండల నాయకులు సంజు, ఎడపల్లి మండల నాయకులు కె రాజయ్య, లక్ష్మీ, ఎల్లయ్య, చిన్నమ్మ, ప్రవీణ్, లింగం, వసంత, పోశెట్టి, రోజా, అబ్బవ్వ, యశ్వంత్ పాల్గొన్నారు.

## సబ్ సెంటర్ కు విద్యుత్ సౌకర్యం పై వైద్య సిబ్బంది హర్షం

**ఎడపల్లి, మే 30 ( జనంసాక్షి ) :**

గత పాలకుల నిర్లక్ష్యంతో ఎవరూ పట్టించుకోని హెల్త్ సబ్ సెంటర్ కు విద్యుత్ సౌకర్యం కల్పించిన జైతాపూర్ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగుల రాజు గౌడ్ ను వైద్య సిబ్బంది అభినందించారు. గత నాలుగు సంవత్సరాల నుండి గ్రామంలో నిర్మించిన సబ్ సెంటర్ కు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వైద్య సిబ్బందితో పాటు సెంటర్ కు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని వైద్య సిబ్బంది వివరించారు. అయితే ఈ సమస్యను నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ నాగుల రాజు గౌడ్ వెంటనే స్పందించి విద్యుత్ సౌకర్యం అందించడం ద్వారా ప్రభుత్వం ఆశించిన ఆశయం నెరవేరుతుందని వైద్య సిబ్బంది స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంగపల్లి స్వామి, పాషా, జైతాపూర్ గ్రామ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సిరిపురం సంతోష్, నరేష్, జంలం రాకేష్, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు





## వివోఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

### టిఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డల్లా సురేష్ మహాజన్

**ఎడపల్లి, మే 30 ( జనంసాక్షి) :**

వివోఏల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారి సమస్యల పరిష్కారం కోసం టీఎల్ఎఫ్ మద్దతు ఉంటుందని టీఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డల్లా సురేష్ మహాజన్ స్పష్టం చేశారు. ఎడపల్లి మండల కేంద్రంలో వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి ఆరవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా టిఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డల్లా సురేష్ మహాజన్ వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విఓఎలకు గౌరవ వేతనం రద్దుచేసి కనీస వేతనం 26 వేలు అందించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడం తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే వీఓఎల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రావాలని, వీఓఏలకు టీఎల్ఎఫ్ పూర్తి మద్దతు ఇస్తుందని డల్లా సురేష్ మహాజన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు శ్రీకాంత్, సాయిఛిరు, శనీకర ఛారి, జాధవ పకీరా నాయక్, ప్రవీణ, సుధాకర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్స్ యూనియన్ క్రికెట్ జట్టుకు జెర్సీల అందజేత

**బోయినపల్లి, మే 30 (జనంసాక్షి)**



చొప్పదండి నియోజకవర్గ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న బోయినపల్లి మండల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ క్రికెట్ జట్టుకు ప్రత్యేకంగా ముద్రించిన జెర్సీలను అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలు యువతలో ఐక్యత, క్రమశిక్షణ, స్నేహభావాలను పెంపొందిస్తాయని అన్నారు. వృత్తి బాధ్యతల మధ్య సమయం కేటాయించి క్రీడల్లో పాల్గొంటున్న ఫోటోగ్రాఫర్స్‌ను అభినం దించారు. జిల్లా స్థాయి పోటీల్లో బోయినపల్లి జట్టు ప్రతిభ కనబర్చి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.జట్టుకు ప్రత్యేకంగా రూపొం దించిన జెర్సీలు అందుకోవడం ఆనందంగా ఉందని ఫోటోగ్రాఫర్స్ సభ్యులు తెలిపారు. జట్టుకు ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంతో పాటు ఆటగాళ్లలో ఉత్సాహాన్ని పెంచుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బూతం వీరస్వామి, దండు తిరుపతి, మండల శ్రీనివాస్, రవి, బుర్ర శివ, రాము, షాదుల్లా తదితర ఫోటోగ్రాఫర్స్ సభ్యులు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొని జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. పోటీల్లో బోయినపల్లి జట్టు రాణించాలని ఆకాంక్షించారు.

## ఎం,పి,హెచ్,ఎస్ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం

### ఎంఈఓ దూస రఘుపతి

**సిరిసిల్ల టౌన్ మే 30 (జనంసాక్షి)**

2026-27 విద్యా సంవత్సరానికి గాను సిరిసిల్ల మండలంలో ప్రీ ప్రైమరీ (ఎల్కేజీ,యూకేజీ)తరగతులను నిర్వహించుటకు సిరిసిల్ల మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెహ్రూ నగర్,గోపాల్ నగర్ బి.వై నగర్, వెంకంపేట,పద్మనగర్ అంబేద్కర్ నగర్ లో గల ఆరు పాఠశాలలకు ప్రభుత్వం అనుమతులను మంజూరు చేయడం జరిగిందని మండల విద్యాధికారి దూస రఘుపతి తెలిపారు. నెహ్రూ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూఈ ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కొరకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఆంగ్ల మాధ్యమంలో బోధన కొరకు ఒక ఇన్స్ట్రక్టర్ ను మరియు ఆయాను ప్రభుత్వం నుండి నియమించడం జరుగుతుందని, అలాగే ప్రీ-ప్రైమరీ (ఎల్కేజీ,యూకేజీ)తరగతుల నిర్వహణ కొరకు లక్ష రూపాయల గ్రాంట్ తో వర్క్ బుక్కులు,యూనిఫామ్స్, ఆట వస్తువులు, కార్పెట్లు,ఫర్నిచర్,రీడింగ్ చైర్స్, తరగతి గది గోడలపై ఆకర్షణీమైన బొమ్మల చిత్రీకరణ కొరకు కేటాయించబడుతుందని అలాగే విద్యార్థులందరికీ అల్పాహారము, మధ్యాహ్న భోజనం అందించబడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు 3 నుండి 5 సంవత్సరాల వయసుగల తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించి, ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు.



## రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

### ఎండపల్లి మండల ఆర్ఐ తోడేటి అన్వేష్..

**ఎండపల్లి జగిత్యాల జిల్లా జనంసాక్షి**



రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని ఎండపల్లి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ తోడేటి అన్వేష్ పేర్కొన్నారు. శనివారం మండలం లోని ముంజంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం( సివిల్ రైట్స్ డే ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కులు,సమానత్వం, సౌభ్రాతృత్వం పై ఆర్ ఐ అన్వేష్ అవగాహన కల్పించారు. అంటరానితన నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి తో పాటు వ్యవసాయ విస్తరణాధికారి బలిజపల్లి సందీప్, ఉపాధి హామీ ఏపీవో అనిల్ కుమార్, ఎండపల్లి ఎస్సీ హాస్టల్ వార్డెన్ అఫ్జల్, ఎమ్మార్పీ డి. రాజారాణి, బసంత్ నగర్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంబేద్కర్ సంఘం నాయకులు చొప్పదండి బుచ్చిలింగం, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మండల పంచాయతీ అధికారి రాజ్ కాంతారావు పదవీ విరమణ సన్మాన మహోత్సవం

**ఇందల్వాయి, (జనంసాక్షి):**
ఇందల్వాయి మండల పంచాయతీ అధికారి రాజ్ కాంతారావు పదవీ విరమణ సన్మాన మహోత్సవం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఈరోజు అత్యంత ఘనంగా జరిగింది. మండల అభివృద్ధి లో, పంచాయతీల బలోపేతంలో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ తోటి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు.

**ముఖ్య అతిథులు – హాజరైన ప్రముఖులు**
ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని రాజ్ కాంతారావు గారికి శుభాకాంక్షలు తెలిపారు.
హాజరైన వారిలో ముఖ్యులు:
అనంతరావు – మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ – డివిజనల్ పంచాయతీ అధికారి జి. బాలయ్య – మండల రెవెన్యూ అధికారి సుదర్శన్ నాయక్ – సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు వీరితో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, మరియు పంచాయతీ కార్యదర్శులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై, రాజ్ కాంతారావు గారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రాజ్ కాంతారావు గారు తన విధి నిర్వహణలో చూపిన ప్రతిభను, నిబద్ధతను వక్తలు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయన శేష



జీవితం ఆరోగ్యంగా, సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. వివరగా, రాజ్ కాంతారావు తనకు సహకరించిన ప్రతి ఒక్క అధికారికి, ప్రజాప్రతినిధికి మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.




## నాలుగు వేల రూపాయల పింఛను ఇవ్వాలంటూ బీడీ కార్మికుల ధర్నా

**ఎడపల్లి, మే 30 ( జనంసాక్షి ) :**
రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం ప్రకారం బీడీ కార్మికులందరికి కటాఫ్ డేట్ ను తొలగించి అర్హులందరికీ 4 వేల రూపాయల పింఛను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట బీడీ కార్మికులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రంతోపాటు బీడీ కార్మికుల వ్యక్తిగత దరఖాస్తు ఫారాలను ఎంపీడీవోకు అందించారు. ఈ సందర్భంగా ధర్నా ఉద్దేశించి తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీ యూ సీ ఐ) నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బి. మల్లేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2023 అసెంబ్లీకి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మా పార్టీకి ఓట్లు వేసి మమ్మల్ని గెలిపిస్తే మేము అధికారంలోకి వచ్చిన 100 రోజులకే బీడీ కార్మికులకు కట్ ఆఫ్ డేటును తొలగించి పెన్షన్ రానటువంటి వారికి నాలుగువేల రూపాయల పింఛను ఇస్తానని, 2016 రూపాయలు వస్తున్నవారికి కూడా 4000 రూపాయలు పెంచి ఇస్తానని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న పెన్షన్లు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. నేడు రేవంత్ రెడ్డి మహిళలందరికీ కోటీశ్వరులను చేస్తానని మాటలతో కార్మికుల కడుపులు నిండయని బీడీ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం 4000 రూపాయలను వెంటనే ఇచ్చి చేతలతో వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున బీడీ కార్మికులతో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి. మల్లేష్ తో పాటు కాలేరు గంగాధర్ బీడీ కార్మిక సంఘ నాయకులు భాగ్య, గంగా లక్ష్మి, సుజాత,లక్ష్మి, రమా,సునంద లా తో పాటు అధిక సంఖ్యలో బీడీ కార్మికులు పాల్గొన్నారు.



## పాలక వర్గం ఆధ్వర్యంలో తాగు నీటి బోరు మరమ్మత్తు

**మల్లాపూర్,మే 30(జనంసాక్షి)**
మండల కేంద్రం లో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో పాడయిపోయిన మంచినీటి బోరు లు మారమ్మత్తు లు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూ వేసవిలో గ్రామం లో మంచి నీటి సమస్యలు ఎక్కడ ఉన్నా సత్వరమే స్పందించి నీటి ఎద్దడి లేకుండా చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ సోమరెడ్డి, వార్డు సభ్యులు ముష్కరి రమేష్, కొంపెల్లి రాకేష్,ముత్యాల గంగా రాజం, భూక్యా శేఖర్,అల్లె చంద్రయ్య, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 12వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె

**ఇల్లంతకుంటలో బతకమ్మ ఆడి నిరసన**

**ఇల్లంతకుంట మే 30(జనంసాక్షి )**
మహిళా గ్రూప్ సభ్యులు చాలా సంవత్సరాల నుండి మహిళా గ్రూపులలో పనిచేస్తున్నామని పనికి తగిన వేతనం ఇప్పించాలని కేవలం మహిళా గ్రూప్ వివోఓలకు రూపాయలు ఐదు వేలు మాత్రమే ప్రభుత్వం ఇస్తుందని ఈ గౌరవ వేతనం ఇరవై వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని మహిళా గ్రూప్ సభ్యులు కొరారు. వీఓఏల సమ్మె 12 రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు ఈ రోజు బతకమ్మ ఆడి నిరసన తెలిపారు. ప్రభుత్వానీ తక్షణమే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలొ వీవోఏల మండలధ్యక్షురాలు బాలలక్ష్మి, కార్యదర్శి బంగారు అంజలి, కోశాధికారి మహంకాలి ఉమారాణి, వీవోఏలు పాల్గొన్నారు.



## ఎన్నికల్లో ఇచ్చిన హమీని నెరవేర్చుచున్న సర్పంచ్

**ఇల్లంతకుంట మే 30(జనంసాక్షి)**
ఇల్లంతకుంట మండల నర్సక్కపేట గ్రామ సర్పంచ్ బెంద్రం శంకరమ్మ ఎన్నికల్లో ఇచ్చిన హమీ మేరకు నిరుపేద కుటుంబాలకు ప్రతి ఒక్కరికి ప్రతి నెల 10 కేజీల చొప్పున బియ్యం అందజేస్తున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నీరు పేదలకు ప్రతీ ఒక్కరికీ ప్రతి నెల 10 కిలోల బియ్యం ఐదు సంవత్సరాల పాటు అందజేయడం జరుగుతుందన్నారు, నేను ఎన్నికల్లో చెప్పిన ప్రతి హామి నెరవేరేచ్చుటకు ప్రయత్నం చేస్తున్నాని తెలిపారు., ఈ బియ్యం పంపిణీ సహయ కార్యక్రంలో మాజి సర్పంచ్ ముత్యం.తిరుపతి , నిరటీ.మధు , నిరటి. వెంకటేష్ , బద్దం.తిరుపతి రెడ్డి , బొల్ల.మల్లారెడ్డి , అన్నా డి.ఎల్లారెడ్డి , బద్దం.సత్తిరెడ్డి , బెంద్రం.సత్యనారాయణ , దూది.శ్రీనివాస్ , చందు లబ్దిదారులు, పాలుగోన్నారు.

## అంజన్న సేవలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే



**మల్యాల మే 30 (జనం సాక్షి)**
తెలంగాణ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామిని శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ నారాయణన్ శ్రీగణేష్ దర్శించుకున్నారు. ఆలయ ఈవో అధికారులు అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శేష వస్త్రం కప్పి స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో టెంపుల్ సుపేరెండేంట్ ఉపాధ్యాయుల చంద్ర శేఖర్,టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్,ఏఎసై చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కొండగట్టులో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం

**మల్యాల మే 30 (జనంసాక్షి)**



ముత్యంపేట గ్రామం కొండగట్టు లోని అంగన్వాడి కేంద్రంలో శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవంలో బాగంగా అమ్మ మాట అంగన్ వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. సూపర్ వైజర్ పవిత్ర మట్లాడుతు 3 నుండి 6 సంవత్సరాల పిల్లలని అంగన్‌వాడిలో చేర్చాలని ఆటా పాట లాతో కూడిన విద్యను అంగన్‌వాడీలో అంధిస్తారాని తెలియజేసారు. కార్యక్రమంలో సిడిపిఓ వీరలక్ష్మి, పర్యవేక్షకులు పవిత్ర, అంగన్ వాడీ టీచర్లు శోభ,గంగా,పద్మ, శారద, మమత, గ్రామప్రజలు, తల్లులు,చిన్నరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**మల్లాపూర్, మే30 (జనంసాక్షి)**



మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన లస్మయ్య హోటల్ నడుకుంటూ జీవించేవాడు ఆయన పక్షవాతం రావడం వలన హాస్పిటల్ ఖర్చుల కోసం మాజీ సర్పంచ్ బిట్ల సరోజన 5000 రూపాయలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు కల్లెడ గంగాధర్, నాయకులు దానవేణి శేఖర్, మ్యాకల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తంగళ్ళపల్లి-ఇల్లంతకుంట పిఎంజిఎస్వై రహదారి పనులను పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణకు కాంగ్రెస్ నాయకుల వినతి

**ఇల్లంతకుంట మే 30(జనంసాక్షి)**
హైదరాబాద్‌లోని గౌరవ ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ నివాసంలో వెల్జీపూరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, తంగళ్ళపల్లి నుండి ఇల్లంతకుంట వరకు పీఎంజీఎస్వై పథకం కింద రోడ్డు విస్తరణ ఆమోదం పొందినప్పటికీ, వెల్జీపూరం నుండి రహీంఖాన్ పేట వరకు పాత రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో, మళ్లీ అధికారులు అంచనాలు సవరించి అనుమతుల కోసం తిరిగి పంపారు, కానీ 2022 సంవత్సరం నుండి అనుమతులు రాకపోవడంతో మధ్యలో నిలిచిపోయిన రహదారి పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. తంగళ్లపల్లి–ఇల్లంతకుంట రహదారి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో కీలకమైనది. నిర్మాణం పూర్తి ఐతే జిల్లాకు రవాణా సౌకర్యాలు మెరుగు పడి ప్రజలకు గణనియమైన ప్రయోజనం కలుగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి, రహదారి పనులు పునఃప్రారంభం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెల్జీపూరం గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్, మాజీ సర్పంచ్ గుండా వెంకన్న, ఏఎంసీ డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్, వార్డు సభ్యులు బొజ్జ శ్రీనివాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి గండికోట సురేష్, సీనియర్ నాయకులు చిలువేరు స్వామి రెడ్డి, సోమిరెడ్డి అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలి

## జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**ముస్తాబాద్ మే 30 (జనంసాక్షి)**
నిఘా నీడలో ముస్తాబద్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలు.101 సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతకు మరింత భరోసా.నేరాల నియంత్రణలో, కేసుల చేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.ఒక సీసీ కెమెరాల 100 మంది పోలీసులతో సమానం.సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందగా ముందుకు రావాలి.శనివారం ముస్తాబద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 101 సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమనికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ కెమెరాలు ప్రారంభించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఒక్క సీసీ కెమెరా100 మందిపోలీసులతో సమానంగాపనిచేస్తుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన నిందితులను త్వరితగతిన గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసు శాఖ ముందంజలో సాగుతోందని తెలిపారు. సీసీ కెమెరాలు, డిజిటల్ నిఘా వ్యవస్థలు,ఆధునిక దర్యాప్తు పద్ధతుల ద్వారా నేరాల నియంత్రణ మరింత సమర్థ వంతంగా జరుగు తోందన్నారు. ప్రజలు, వ్యాపార స్థులు, ప్రజాప్రతి నిధులు స్వచ్ఛందగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని,తద్వారా పట్టణాల్లో , గ్రామాల్లో సంచరించే అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం,నేరాలకు పాల్పడిన వ్యక్తులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు.ప్రజల భాగస్వామ్యంతోనే సమాజంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయన్నారు.ముస్తాబద్ మండలం తో పాటుగా గ్రామాల్లో స్వచ్ఛందగా ముందుకు వచ్చి 101 సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ధాతలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఎస్పీ గారి వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ నాగేశ్వరరావు, ఎస్.ఐ గణేష్ , ప్రజాప్రతినిధులు , సన్ రైస్ సీసీ కెమెరాల కంపెనీ సభ్యులు , పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## ముస్తాబాద్‌లో నార్కోటిక్ డాగ్‌తో ఆకస్మిక తనిఖీలు

**ముస్తాబాద్ మే 30 (జనంసాక్షి)**
మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా ముస్తాబాద్ పట్టణంలోని పలు షాపులు, వాణిజ్య సంస్థల్లో పోలీసులు నార్కోటిక్ డాగ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వస్తువులు, మాదకద్రవ్యాల నిల్వలు లేదా విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ తనిఖీలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

## సిసి కెమెరాను ప్రారంభించిన డి.ఎస్.పి నాగేంద్ర చారి



**ముస్తాబాద్ మే 30 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో గ్రామస్తులు ఏర్పాటుచేసిన 30 సీసీ కెమెరాలు ప్రారంభించిన సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి రూరల్ సీఐ నాగేశ్వరరావు సర్పంచ్ తాటిపల్లి శంకర్ పాలకవర్గ సభ్యులు ప్రజా ప్రతినిధులు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ గూడెం గ్రామస్తులు గ్రామంలో శాంతిభద్రతలు దొంగతనాలు దోపిడీలు అరాచకాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు ఈ రోజుల్లో సంఘవిద్రోహకులు చేస్తున్న అరాచకాలు ప్రత్యక్షంగా చూసినా ప్రజలు భయాందోళన గురి అయ్యే ఇతరత్రా కారణాలవల్ల సాక్ష్యం చెప్పలేకపోతున్నారని సీసీ కెమెరాలు వల్ల ఎంతో లాభదాయకమని నిందితులను గుర్తించుటలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు ఈ సందర్భంగా గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామము పూర్తిగా రక్షణ వలయంలో ఉంటుందని దోపిడీలు దొంగతనాలు చేయడానికి కూడా భయాందోళనలు ఉంటాయన్న అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటిపల్లి శంకర్ పాలకవర్గ సభ్యులతో పాటు గ్రామ ప్రజాప్రతినిధులు అంజన్ రావు, శ్రీధర్ బొప్ప, నరసయ్య, కుర్ర సావిత్రి, గిరి చాడ శ్రీనివాస్, అమ్మ ఫౌండేషన్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనుమతుల్లేని 'ర్యాంక్ ఫోర్డ్ అకాడమీ'ని వెంటనే మూసివేయాలి ఎస్ఎఫ్ఐ

**కరీంనగర్ టౌన్, మే 30 ( జనంసాక్షి):**
ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న 'ర్యాంక్ ఫోర్డ్ అకాడమీ'ని వెంటనే మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం రేకుర్తిలోని అకాడమీ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, అకాడమీల పేరుతో కనీస ఇంటర్మీడియట్ అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా అడ్మిషన్లు చేపడుతూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రకరకాల ఆఫర్లతో విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకర్షిస్తూ, ఒక లాడ్జి కింద గదులను అద్దెకు తీసుకుని అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిస్తున్నారని విమర్శించారు. అపార్ట్‌మెంట్లలో ఇలాంటి నకిలీ కళాశాలలు నడుస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో అనుమతులు లేని ఇంటర్మీడియట్ కళాశాలలు, అకాడమీల వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని, మోసపూరిత అడ్మిషన్లు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అసంపల్లి వినయ్ సాగర్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, అక్షయ్, సన్నీ, రాకేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2 నుంచి మహాలక్ష్మి లకు స్మార్ట్ కార్డులు

**ముస్తాబాద్ మే 30 (జనంసాక్షి)**



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిసింది, ప్రస్తుతం ఆధార్ కార్డు చూపించి తెలంగాణ మహాలక్ష్మి లు ఉచితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఆధార్ కార్డు స్థానంలో కొత్తగా స్మార్ట్ కార్డుల పంపిణీ కి రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ కార్డు ను రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నుంచి అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.ఈ ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీలోబడ్జెట్ సన్నాహక సమావేశం లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ఈ విషయమై సమీక్షించారు. 2026- 27 రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధుల కేటా యింపు ప్రతిపాదన లను ఆర్థికశాఖ మంత్రి కి ఎండీ నాగిరెడ్డి, వివరించడంతో పాటు స్మార్ట్ కార్డుల జారీకి సంబంధించిన వ్యయం గురించి తెలిపారు.ఇందుకు ఆమోదం తెలపడంతో తొలుత జిల్లాకు ఒక మండలా న్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయనున్నా రు. ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఆర్టీసీలో ప్రయాణించే మహిళలకు పంపిణీ చేసే స్మార్ట్ కార్డు ఏటీఎం తరహాలో ఉండనుంది.ఆధార్ కార్డు, ఒక ఫొటో సేకరించి మహిళల ప్రాథమిక సమాచారం చిప్‌తో అనుసంధానిస్తారు. తర్వాత వారి పేర్లతో కార్డు జారీ చేస్తారు. అమల్లోకి వచ్చాక స్మార్ట్ కార్డు చూపకుం టే ఉచిత ప్రయాణా నికి అనుమతి ఉండ దు.ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకాన్ని వినియోగిం చుకోగా.ఈ పథకం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్ల రూపాయలు ఆదా చేశారు.ఇతర రాష్ట్రాల వారు నకిలీ ఆధార్ కార్డులతో ఈ పథకాన్ని దుర్వినియో గం చేస్తున్న ఘటన లను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బతుకు తెరువు కోసం పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన వేలాది మహిళా కూలీ లు, ప్రైవేటు ఉద్యోగు లు నకిలీ ఆధార్ కార్డుల సాయంతో బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు.దీని వల్ల పెద్ద మొత్తంలో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతుందని అధికారులు గుర్తించారు.

## కొత్తపెల్లి గ్రామ నూతన కార్యదర్శిగా శ్రీధర్..

**గంభరావుపేట మే 30 జనంసాక్షి**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపెల్లి గ్రామపంచాయతీకి నూతన కార్యదర్శిగా శ్రీధర్ నియమితులు చేశారు, ఈ సందర్భంగా ఆయనకు కొత్త పెల్లి బిజెపి నాయకులు శ్రావణ్ యాదవ్ శ్రీనివాస్ గ్రామస్తులు బాల్రెడ్డి బంటు మహేష్ వార్డు సభ్యులు గాధ మల్లయ్య శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు, కొత్తపల్లి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



## పర్యావరణ కార్యక్రమాల్లో రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన ఎస్ఆర్ఆర్ కళాశాల

**కరీంనగర్ టౌన్, మే 30, ( జనం సాక్షి)**
కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో రాష్ట్రస్థాయిలో విశిష్ట గుర్తింపు పొందింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఎంపిక చేసిన రాష్ట్రంలోని అత్యుత్తమ మూడు కళాశాలల్లో ఎస్ఆర్ఆర్ కళాశాల స్థానం సంపాదించింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కలవకుంట రామకృష్ణ మాట్లాడుతూ, ఉత్తర తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వ కళాశాలగా ఎస్ఆర్ఆర్ విద్యా రంగంలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలోనూ ముందంజలో నిలిచిందన్నారు. హరిత యజ్ఞం, రైన్‌వాటర్ హార్వెస్టింగ్, మియావాకి ఫారెస్ట్, బటర్‌ఫ్లై గార్డెన్, ఫ్రూట్ గార్డెన్, రోజ్ గార్డెన్, రెండు లక్షల విత్తన బంతుల తయారీ, 365 రోజుల మొక్కల సంరక్షణ వంటి అనేక కార్యక్రమాలు కళాశాలకు ఈ గుర్తింపును తీసుకొచ్చాయని తెలిపారు.కళాశాల తరఫున వృక్షశాస్త్ర సహాయ ఆచార్యులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పడాల తిరుపతి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆడిటోరియంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత ఏడాది నిర్వహించిన పర్యావరణ కార్యక్రమాలను వివరించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రొఫెసర్ డబ్ల్యూ.జి. ప్రసన్నకుమార్ ప్రశంసలు వ్యక్తం చేశారు.జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అత్యుత్తమ పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టిన కళాశాలలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. ఈ సందర్భంగా డాక్టర్ పడాల తిరుపతిని ప్రిన్సిపల్ కలవకుంట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్స్ నితిన్ పాఠక్, తాళ్లపల్లి



రాజయ్య, హరిత యజ్ఞ సమన్వయకర్త డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్‌తో పాటు అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారులు అభినందించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి

- ఉత్తర తెలంగాణ జిల్లాలు ఎడారిగా మారుతాయి..
- రైతులకు అన్యాయం చేయవద్దు..
- ఎన్‌డీఎస్‌ఏ ఎప్పుడో మరమ్మతులు చేయాలని సూచించింది..
- రాష్ట్ర ప్రభుత్వం పంతాలు పట్టింపులకు పోవద్దు..
- రేవంత్ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి..
- ఇప్పటికే రైతులకు నష్టం వాటిల్లింది..భూగర్భ జలాలు అడుగంటాయి..
- మాజీ కేంద్ర మంత్రి..మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ..

**గోదావరిఖని, జనంసాక్షి:** కాళేశ్వరం ప్రాజెక్టుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు.గోదావరిఖని ఉదయ్‌నగర్‌లోని బీజేపీ నాయకులు బల్మూరి అమరేందర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడారు. ఇప్పటికే ఉత్తర తెలంగాణ జిల్లాలోని రైతులు సాగునీరులేక తల్లడిల్లిపోతున్నారన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేయరాదని సూచించారు. గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఏనాడో మరమ్మతులు చేయాలని చెప్పిందని దత్తాత్రేయ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంతాలు పట్టింపులకు పోయి రైతులకు నష్టం చేయవద్దని ఆయన తెలిపారు. సీఎం రేవంత్ చిత్తశుద్ధిని నిరూపించు కోవాల్సిన అవసరముందన్నారు.తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలంటే మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంద న్నారు. ఒకవేళ తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు చేపట్టినా ముందుగా సుందిళ్ల ప్రాజెక్టుకు మరమ్మతులు చేయా ల్సిన అవసరముంటుందని దత్తాత్రేయ తెలిపారు. నిర్మాణం జరిగిన ప్రాజెక్టును వదిలి వేరే ప్రాజెక్టును మొదలుపెట్టడం సరైంది కాదన్నారు.ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) కమిటి రేవంత్ ప్రభుత్వానికి దాదాపు రెండు సంవత్సరాల క్రితమే మరమ్మతలు చేపట్టాలని సూచించిందన్నారు.అయినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తిన్నట్టుగా వ్యవహరిస్తుందని దత్తాత్రేయ మండిపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టునులోని మూడు బరాక్‌లు మేడిగడ్డ,అన్నారం, సుందిళ్లను మరమ్మతులు చేయకుండా వదిలిపెడితే ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తక్షణం రేవంత్ ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులు మొదలుపెట్టాలని ఆయన సూచించారు.మరమ్మతులు చేపట్టకపోతే ఉత్తర తెలంగాణ జిల్లాలోని రైతులు సాగునీటికి ఇబ్బందులకు గురవుతారని ఆయన తెలిపారు.



ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకన్న, బీజేపీ దాని అనుబంధ సంఘాల నాయకులు మీస అర్జున్‌రావు, బల్మూరి వనిత, కాశీపాక శివజీ, పిడుగు కృష్ణ, కోమళ్ల మహేష్, సురేష్‌రెడ్డి, మేరుగు హన్మంతుగౌడ్, క్యాతం వెంకటరమణ,మచ్చ విశ్వాస్, మాతంగి రేణుక, సుల్వ లక్ష్మినర్సయ్య, కందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాల్వల్లో యుద్ధ ప్రాతిపదికన పూడిక తీయాలి

### నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి..

**గోదావరిఖని, జనంసాక్షి:**కాలువల్లో యుద్ధ ప్రాతిపదికన పూడిక తొలగించి వరద ముప్పు నివారిశీచడానికి చర్యలు తీసుకుంటున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం ఒకటవ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె, అరుణశ్రీతో కలిసి ఆయన పర్యటించారు.ఈ సంధర్భంగా స్థానిక నాయకులు మడిపెల్లి మల్లేష్ వారికి స్వాగతం పలికి కాలనీ సమస్యలను ప్రత్యక్షం గా చూయించారు మేయర్ ఆదేశాలతో జెసిబి, బ్లేడ్ ట్రాక్టర్, చైన్ జెసిబి,బాబ్‌కార్ట్, జెట్టిశీగ్ యంత్రం,పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో పి.కె.రామయ్యకాలనీ పట్టణ ప్రకృతి వనం ప్రక్కన ఉన్న వీధుల్లో పూడుకపోయి ఉన్న ఉపరితల కాలువను పూర్తిగా శుభ్రం చేయించారు.తుప్పలు, పొదలు, పిచ్చి చెట్లు పెరిగి చెట్ల కొమ్మలు రోడ్డు మీదకు వచ్చి నడవడానికి కూడా వీల్లేకుండా ఉన్న వీధుల్లో బ్లేడ్ యంత్రం సహాయంతో వాటిని తొలగించారు.దీంతో దారులు విశాలంగా మారాయి . మిగిలిపోయిన యుజిడి,రోడ్లను కూడా డిఎంఎఫ్‌టి, ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులతో నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.స్పెషల్ డ్రైవ్‌లో మునిసిపల్ సిబ్బంది చాలా బాగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాలువల్లో నిలిచిపోయిన పూడిక తొలగింపు ఇప్పుడు జరుగుతున్నదని అన్నారు.ఎంఎల్ఏ కృషితో అభివృద్ధి చురుగ్గా జరుగుతున్నదని అన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఋతుపవన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వర్షాకాలం రాకముందే కాలువల్లో పూడిక తొలగించే పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. వరద ప్రభావం ఉండే మురుగునీటి కాలువలలో పూడిక తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు.వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టి మరింత మెరుగుపరుస్తామని అన్నారు.కార్పొరేటర్ వెంగళ బాపు, నగరపాలక సంస్థ ఎస్ఇ గురువీర, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎ ఇ తేజస్విని, సానిటరి ఇన్స్పెక్టర్ సంపత్, సీనియర్ అకౌంటెంట్ రాజ్‌కుమార్, జవాన్ సూర్య, నగరపాలక సంస్థ సిబ్బంది, మెప్మా ఆర్‌పిలు పాల్గొన్నారు.

## ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి: రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

**గోదావరిఖని, జనంసాక్షి:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు,వారెంట్ల అమలు,పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు.ఇప్పటివరకు నమోదైన కేసులు,పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు.దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీ మాట్లాడుతూ,కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న కేసుల దర్యాప్తులో ఎలాంటి రాజీ పడకుండా పారదర్శకత,నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.2025 సంవత్సరానికి ముందు నమోదై దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో విచారణ,అరెస్టులు, సాక్ష్యాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రాపర్టీ,బాడిలీ అఫెన్స్ కేసుల దర్యాప్తును పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించాలని తెలిపారు.గ్రేవ్ కేసుల పురోగతిని డీసీపీలు, అదనపు డీసీపీలు వారానికి ఒకసారి సమీక్షించాలని ఆదేశించారు.ఆర్థిక నేరాల కేసుల్లో చట్టప్రకారం నిందితులకు సంబంధించిన



ఆస్తులను జప్తు చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. కిడ్నాపింగ్, మిస్సింగ్ కేసుల్లో బాధితులను గుర్తించడంలో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని,అలాంటి కేసుల్లో ఆలస్యం ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని దెబ్బతీసే అవకాశం ఉందన్నారు.ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను న్యాయస్థానం అనుమతితో త్వరితగతిన నిర్వీర్యం చేయాలని సూచించారు.సైబర్ క్రైమ్,ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్థులు ఉన్నట్లయితే వారిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి,వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని, ప్రజల నుంచి నేరుగా అందే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు.సీపీ కార్యాలయం ద్వారా వచ్చే ఫిర్యాదులపై కూడా వేగంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.పోలీస్ సిబ్బంది విధిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని, విధి నిర్వహణలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు.డీసీపీలు ఏ.భాస్కర్,బి.రామ్‌రెడ్డి, డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, ఏసీపీలు ఎం.రమేష్,కృష్ణ, ఆర్.ప్రకాష్,ఏసీపీ వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, నాగేంద్రగౌడ్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



## మండల కేంద్రంలో ఆరు ప్రీ ప్రైమరి పాఠశాలల నిర్వహణ

**ఎల్లారెడ్డిపేట, మే 30, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలో ఈ విద్యా సంవత్సము 2026-27కు ఆరు ప్రీ ప్రైమరి పాఠశాలలకు ప్రభుత్వం నుండి అనుమతి ఇవ్వడం జరిగిందని శనివారం మండల విద్యాధికారి కృష్ణహరి తెలిపారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్, కిషన్‌దాస్‌పేట, నారాయణపూర్, బండలింగంపల్లి, దుమాల, వెంకటాపూర్ గ్రామాలలో గల ప్రాథమిక పాఠశాలలకు ఈ సంవత్సరం నుండి ప్రీ ప్రైమరికి అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విద్యా సంవత్సరం జూన్ 12 నుండి ఈ పాఠశాలలో ప్రీ ప్రైమరి తరగతులు నిర్వాహించడం జరుగుతుందన్నారు. ఈ పాఠశాలలో నాలుగు సంవత్సరములు పైబడిన విద్యార్థులకు అవకాశము ఉంటుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి గాలిపెల్లి కృష్ణహరి కోరారు. గత సంవత్సరము రాజన్నపేట, తిమ్మపూర్, అగ్రహారం పాఠశాలలకు అనుమతి లభించిందని మొత్తం ప్రీ ప్రైమరి పాఠశాలలు 9 అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## మంత్రి శ్రీధర్‌బాబు జన్మదినం సందర్భంగా చీరెల పంపిణీ..

**గోదావరిఖని, జనంసాక్షి:** రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు స్థానిక లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ మహంకాళి స్వామి హాజరై కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ మహిళా కార్మికులకు చీరలు, బట్టలను పంపిణి చేసారు. కొప్పుల శంకర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రిగా శ్రీధర్‌బాబు ఎదగాలని కొప్పుల శంకర్ అన్నారు.ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకులు మాదాసు శ్రీనివాస్, ముస్కె రవికుమార్, మహమ్మద్ తాజ్, సీనియర్ న్యాయవాదులు మేడ చక్రపాణి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాల్వా లింగస్వామి, మారేల్లి రాజిరెడ్డి, నాయిని ఓదెలు, కార్పొరేటర్ చిదురాల నాగరాజు, న్యాయవాదులు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## క్రైండ్స్ ఇనిషియేటివ్ ఫౌండేషన్..

### - తబిత ఆశ్రమ పిల్లలకు స్కూల్ కిట్ల పంపిణీ..

**అంతర్గాం, జనంసాక్షి:** క్రైండ్స్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ (సెక్షన్ 8 కంపెనీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం రామగుండంలోని తబిత ఆశ్రమ పిల్లకు ఉచిత స్కూల్ కిట్ల పంపిణీ జరిగింది.నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని తబిత అనాథ ఆశ్రమంలోని పిల్లలకు ఈ కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ప్రాజెక్ట్ సిడిపిఓ అలేఖ్య పటేల్ హాజరయ్యారు. ఆమె చేతులమీదుగా స్వచ్ఛంద సంస్థ పోస్టర్లు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత ఆశయంతో క్రైండ్ ఫౌండేషన్ వారు ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. మేడారం స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను ఇలాంటి పిల్లల మధ్య నిర్వహించడం శుభపరిణామమన్నారు.క్రైండ్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి, విద్యాభ్యాసానికి మావంతు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతోనే కిట్లను పంపిణీ చేశామన్నారు.ఈ కార్యక్రమంలో క్రైండ్స్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ డైరెక్టర్స్ సుంచురి రాజశేఖర్, మిట్టపల్లి లిటిల్, గుంటి రవికుమార్, గజ్జల ప్రవీణ్, ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్రనాయక్ పిల్లలు పాల్గొన్నారు.

